AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

24-7-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

గుడ్డు ధరలు పైపైకి..



2



2

అక్రమ రిజిస్ట్రేషన్ ముగ్గురి అరెస్ట్

## డొంకేశ్వర్‌లో బీఎల్‌వోలకు సన్మానం



**అక్షరటుడే, డొంకే-శ్వర్:** మండలంలో వందశాతం ఎస్ఐఆర్‌ను పూర్తిచేసిన బీఎల్‌వోలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల బాబురావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ముసుకు వెంకట్రాంరెడ్డి, ఎస్ఐఆర్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, సర్ ప్రోగ్రామ్ సూపర్‌వైజర్లు ఇసుగంటి దశాగౌడ్, గంగాసారం సర్పంచ్ మహేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులు రథాన్ని లాగంగా.. జగన్నాథుడే మురిసెనుగా..



ఇందూరు భక్తజనసంద్రమైంది.. భక్తుల జయజయధ్వానాల మధ్య జగన్నాథ రథచక్రాలు ముందుకు కదిలాయి.. నగరంలోని కంఠేశ్వర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో నీలకంఠేశ్వరాలయం వద్ద రథయాత్రను మేయర్ ఉమారాణి, సీపీ సాయిచైతన్య, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. స్వయంగా రథాన్ని లాగారు.

– అక్షరటుడే, ఫొటోగ్రాఫర్ నిజామాబాద్







## దళితులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాబోయే ఎన్నికల్లో దళిత అభ్యర్థులకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు కేటాయించాలని తెలంగాణ బీజేపీ ఎస్సీ మోర్చా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోతుల పురుషోత్తం మాట్లాడుతూ.. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేసిందని, రాబోయే ఎన్నికల్లోనూ అదే విధంగా ఎస్సీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అమలు చేస్తున్న రీతిలోనే రాజకీయ రంగంలోనూ ఎస్సీలకు 15శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, ఈ విధానాన్ని తెలంగాణ రాష్ట్రమంతటా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## భూసేకరణ చేపట్టాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు, మంజీర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పరిధిలో చేపడుతున్న పనులకు భూసేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో రెండు ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకున్న సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ కీలకమని, ప్రతి దశను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూయజమానుల సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించాలని, పరిహారం చెల్లింపులను నిబంధనల ప్రకారం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఓవైపు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తుండగా మరోవైపు వాటి అభివృద్ధికి కృషి చేస్తున్న వారిని బైండోవర్ చేయడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ క్రమంలో తమ పిల్లలను ప్రైవేటులో చేర్చాలా..? ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలా అనే సందిగ్ధంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. దాంతో జిల్లాలో ఈ అంశంపై తీవ్ర చర్చ సాగుతోంది.** —అక్షరటుడే, కామారెడ్డి




గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ప్రభుత్వ పాఠశాలలు ఎలాంటి పరిస్థితిలో ఉన్నా అందులోనే తమ పిల్లలను చేర్చి చదివించేవారు. రానురాను పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో రోజు కూలీ చేసి అయినా తమ బిడ్డ బాగా చదువుకోవాలి అని రూ.వేలల్లో ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ కంటే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇటీవల ప్రజల్లో అక్కడక్కడా మార్పు రావడం, ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ర్యాంకులు రావడంతో విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. ఇటీవల ప్రతి గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులు మా గ్రామంలోకి రావద్దు అనే తీర్మానాలు పెరిగి పోవడంతో కొందరు తల్లిదండ్రుల్లో తమ పిల్లలను ఎక్కడ చదివించాలి అనే విషయంపై సందిగ్ధం నెలకొంది.

# సర్కారు ప్రైవేటు బడికా!

సందిగ్ధంలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రభుత్వ బడిలో చేర్పించాలని తీర్మానం

వ్యతిరేకిస్తున్న పలువురు తల్లిదండ్రులు

గతేడాది కంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరగడంతో రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు భవిష్యత్తును వేలెత్తి చూపేలా చేస్తున్నాయన్న టాక్ వినిపిస్తోంది.

### ప్రత్యేకంగా తీర్మానాలు

పలు గ్రామాల్లో ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చదివించాలని.. ప్రైవేటు బస్సులు గ్రామాల్లోకి రావడాన్ని నిషేధించాలని తీర్మానాలు చేయడం కనిపించింది. అంతేకాకుండా పలువురు గ్రామస్తులు, సర్పంచులు ఆ తీర్మానాన్ని పక్కాగా అమలు చేయడం మొదలుపెట్టారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రైవేట్‌కు వెళ్లే విద్యార్థులు సర్కార్ బడిలో చేరారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

### తీర్మానాలపై ఆగ్రహం

కొన్ని గ్రామాల్లో ఈ తీర్మానాలను కొందరు తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. తమ పిల్లలను ఎక్కడ చదివించాలి అనేది నిర్ణయించడానికి మీరెవరు అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటులో ఉన్నట్టుగా సౌకర్యాలు ఉన్నాయా..? ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారా..? ఆంగ్ల భాషలో పట్టు సాధిస్తారని నమ్మకం ఇస్తారా..? అని ప్రశ్నిస్తున్నారు.

### పోలీసులకు ఫిర్యాదు.. సర్పంచ్ బైండోవర్

కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆఫర్లు ప్రకటిస్తూ తమవైపు లాక్కునేందుకు ప్రణాళిక రచిస్తున్నారన్న ప్రచారం ఇటీవల జోరందుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరితే ప్రైవేట్ పాఠశాలల పరిస్థితి ఏమిటో అర్థం కాని పరిస్థితుల్లో ఇలాంటి జిమ్మిక్కులు వాడుతున్నట్టుగా ప్రచారం సాగుతోంది. తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. అంతటితో ఆగకుండా తహశీల్దార్ ముందు సర్పంచ్‌ను బైండోవర్ చేయడం దుమారం రేపింది.

### పాఠశాలలు బలోపేతం అయ్యేనా..?

గ్రామాల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గ్రామాల నుంచి పాఠశాలలు తగలకుండా ఉండేందుకు ప్రైవేట్ పాఠశాలల వైపు మల్లకుండా చేస్తున్న ప్రయత్నాలు ఆదిలోనే బెడిసికొట్టడం కలకలం రేగింది. ఏకంగా సర్పంచ్ ను బైండోవర్ చేయడాన్ని ఆ మండల సర్పంచుల ఫోరమ్ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ అంశం జిల్లాలో తీవ్ర చర్చకు దారి తీయగా తీర్మానాలు అంశం పక్కకు పెట్టినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలో భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందా.. లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## మహాధర్నాను విజయవంతం చేయాలి




**అక్షరటుడే, బాన్సువాడ:** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆగస్టు 1న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భునేకర్ సంతోష్ కోరారు. బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ హెచ్ఎస్ కోనాపూర్ పాఠశాలల్లో మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సంతోష్ మాట్లాడుతూ.. పెండింగ్ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, డీఏ నివేదిక విడుదల చేయాలని, 51శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, టీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్ ఆర్య, వేద ప్రకాష్, కృష్ణ ప్రసాద్, సంతోష్, శ్రీకాంత్ రెడ్డి, సౌమ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల తనిఖీ



**అక్షరటుడే, బాల్కొండ:** గ్రామాల్లో పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని డీపీవో శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాల్కొండ గ్రామపంచాయతీని సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని, లోతట్టు ప్రాంతాల్లో నీరునిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీవో గంగామోహన్, ఏపీవో ఇందిర, సర్పంచ్ గాండ్ల రాజేష్, ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్, పంచాయతీ కార్యదర్శి మోహన్, టీఏ రవీందర్ పాల్గొన్నారు.

# ఎజెండాలో అవసరం లేని అంశాలు : బీజేపీ కౌన్సిలర్లు

**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపాలిటీ సమావేశాల్లో ప్రజలకు అవసరం లేని అంశాలను ఎజెండాలో చేరుస్తున్నారని.. ఐదు నెలలుగా ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా జరగలేదని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపించారు. బిల్లుల దుర్వినియోగంపై ప్రశ్నిస్తే కుంటిసాకులు చెప్పి గొడవ చేస్తున్నామని ఛైర్‌పర్సన్ అనడం సరికాదన్నారు. ఛైర్‌పర్సన్ పీఠంపై ప్రజలు కూర్చోబెట్టింది ఇష్టం వచ్చిన ఎజెండాలు పెట్టి జేబులు నింపుకోవడానికి కాదన్నారు. మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్ ఉన్నప్పటికీ అధికారులంతా అంతా సార్‌కే తెలుసని చెబుతున్నారని, ఆ సార్ ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమానికి వార్డుకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.2.45 కోట్ల బిల్లులు పెట్టగా, జేబులు నింపుకోవడానికి మాత్రం రూ.13 కోట్ల బిల్లులు పెట్టారని ఆరోపించారు. ఆ రూ.13 కోట్ల లెక్కలు చెప్పాలని, దానిపై చర్చించాలని అడిగితే కుంటిసాకులు అని చెప్పడం ఏమిటని నిలదీశారు. గతంలోనే జేసీబీ కొనుగోలుకు తీర్మానం చేసినా మళ్లీ అద్దె కోసం రూ.30 లక్షలు, రూ.15.50 లక్షల బిల్లులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కొత్త జేసీబీ కొంటే రూ.35 లక్షలతో పని అవుతుందని, అద్దె పేరుతో రూ.45 లక్షల బిల్లులు పెట్టడం




దేనికి అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆమోదం పొందిన అంశాన్ని తెలియకుండా మళ్లీ ఎజెండాలో చేర్చడం, ఒక ఎజెండాను రెండుసార్లు తిరస్కరించినా మూడోసారి అదే అంశాన్ని పెట్టడం సరికాదన్నారు. సమావేశం రద్దుకు బీజేపీ కౌన్సిలర్లే కారణమని చెప్పడం సరికాదన్నారు. మున్సిపాలిటీలో 30 చెత్త వాహనాలు ఉండగా 8 డంపింగ్ యార్డు వద్దనే ఉన్నాయన్నారు. వాటికి రిపేర్ చేయించకుండా.. డీజిల్ వాడుతున్నామని బిల్లులు రాస్తున్నారని ఆరోపించారు.

## రేషన్ కార్డులకు ఈకేవైసీ ప్రక్రియ షురూ..

**జిల్లాలో రేషన్‌కార్డులను ఈ కేవైసీ ప్రక్రియ ప్రారంభమైందని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు. రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా తమ ఈ కేవైసీ చేయించుకోవాలని.. నిర్లక్ష్యం చేస్తే ఆ సభ్యుడికి వచ్చేనెల నుంచి బియ్యం సరఫరా జరగదని వారు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని రేషన్‌షాపుల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైందని.. ఈనెల 31వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. నగరంలోని 26వ డివిజన్‌లో 21వషాప్ నంబర్‌లో రేషన్ డీలర్ హిమబిందు ఈ కేవైసీ ప్రక్రియ నిర్వహించారు.** – అక్షరటుడే, నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని.. యువతను సంఘటితం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్ పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండల బీజేపీ నాయకులు ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వంశీ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ నాపై నమ్మకంతో బీజేవైఎం జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చిందని.. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శాయాశక్తులా కృషి చేస్తానన్నారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా బీజేపీ చీఫ్ దినేష్ కులాచారి ఆదేశాల మేరకు పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

## పోచారం గ్రామానికి బస్సు ఏర్పాటు



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని పోచారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారు. ఇటీవల గ్రామానికి బస్సు ఏర్పాటు చేయాలని తహశీల్దార్,ఎంపీడీవోలకు గ్రామస్తులు విన్నవించారు. దీంతో వారు స్పందించి బాన్సువాడ డిపో మేనేజర్‌తో మాట్లాడి పోచారం గ్రామం వరకు బస్సును పొడిగించారు. గ్రామానికి వచ్చిన బస్సును గ్రామస్తులతో అధికారులు పూజ చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలాజీ పాటిల్ అధికారులకు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శామప్ప పటేల్, మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, నాయకులు ధరమ్ సింగ్, మచ్చేందర్ పటేల్, రాజేందర్, మదన్, కిషన్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## మచ్చర్లలో వంతశాతం ఎస్ఐఆర్ పూర్తి



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూరు మండలం మచ్చర్ల గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వందశాతం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కట్ట నర్సయ్య ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో విశేషంగా కృషి చేసిన వారికి శాలువాలతో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడంతోనే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయడం సాధ్యమైందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను నమోదు చేసుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన బీఎల్‌వోలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**పేద, మధ్యతరగతి ప్రజలకు చౌకగా లభించే ఏకైక ప్రొటీన్ ఆహారం కోడిగుడ్డు. వైద్యులు నిత్యం గుడ్డును ఆహారంగా తీసుకోవాలని సూచిస్తారు. అలాంటి గుడ్డు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతోంది. వీట ధరలు ఇటీవల భారీగా పెరిగాయి. దీంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.**

**–అక్షరటుడే, ఎల్లారెడ్డి**

# గుడ్డు ధరలు పైపైకి..



- రోజురోజుకూ పెరుగుతున్న ధరలు
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు

మొన్నటివరకు రూ.6 నుంచి రూ.7 మధ్య పలికిన ఒక్కో గుడ్డు ధర (Egg Price), ప్రస్తుతం మార్కెట్లో రూ.8 నుంచి రూ.9 కు చేరింది. కేవలం గుడ్డు మాత్రమే కాకుండా, చికెన్ ధరలు కూడా సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో చికెన్ ధర రూ.290 నుండి రూ.320 వరకు పలుకుతుండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

### ఉత్పత్తి వ్యయం పెరగడంతో..

గుడ్డు ధర ఈ స్థాయిలో పెరగడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని పౌల్ట్రీ రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. కోళ్లకు మేతగా వేసే సోయాబీన్, మొక్కజొన్న, జొన్నల ధరలు విపరీతంగా పెరగడంతో ఉత్పత్తి వ్యయం భారమైందని పేర్కొంటున్నారు. ఎండాకాలంలో కోళ్లకు సోకిన పలు రకాల వ్యాధుల వల్ల దేశవ్యాప్తంగా ఉత్పత్తి భారీగా తగ్గింది. ఫలితంగా రైతులకు తీవ్ర నష్టాలు వాటిల్లాయి. ఫలితంగా చివరకు పౌల్ట్రీ రైతులు కోళ్ల పెంపకంపై ఆసక్తి చూపలేదు. దాంతో కోళ్ల ఉత్పత్తి తక్కువ కావడంతో గుడ్లు, చికెన్ ధరలు పెరిగాయని అంటున్నారు.

### రవాణా ఖర్చుల భారం

ఇంధన ధరల పెరుగుదల ప్రభావం రవాణా రంగంపై కూడా పడింది. కోళ్ల ఫారాల నుండి మార్కెట్లకు గుడ్లు, కోళ్లను తరలించే ఖర్చులు అదనపు భారంగా మారాయి. ఒకేసారి ఒక్కో గుడ్డుపై రూ.2 వరకు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ధరల పెరుగుదల ప్రభావం కేవలం ఇళ్లకే పరిమితం కాలేదు. హోటళ్లు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లలో ఎగ్ కర్రీస్, చికెన్ వంటకాల ధరలను సైతం వ్యాపారులు పెంచేశారు.

## వారంరోజుల్లోగా తాగునీటి సమస్యకు పరిష్కారం



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ :** మండల కేంద్రంలోనీ కొత్త ప్లాట్లలో మంచినీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా మండల బీజేపీ నాయకుడు తానాజీ రావు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండల పంచాయతీ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి మంచినీటి సమస్య పై సమీక్షించారు. వారం రోజుల్లోగా సమస్య పరిష్కారం చేసి ప్రజలకు మంచి నీటిని అందిస్తామని సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ నాగులు, వార్డు సభ్యులు హన్మాండ్లు, ఫిరోజ్, గ్రామస్తులు బోడి మల్లికారున, దేవిసింగ్ పాల్గొన్నారు.



## నందిపేటలో వైద్యశిబిరం

**అక్షరటుడే, నందిపేట్:** మండల కేంద్రంలో హనుమాన్ గల్లి దుర్గాదేవి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం ఉచిత ఎన్‌సీడీ వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఎర్రం సిలిండర్ లింగం, పాలకవర్గ సభ్యులు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ..ప్రస్తుత జీవనశైలి మార్పులతో రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. వ్యాధులు తీవ్రం కాకముందే ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు. శిబిరంలో వైద్యురాలు స్వాతి, వార్డు సభ్యులు కస్తూరి గంగాధర్, చేపూరి వినీత్ కుమార్, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, ఇందూరు :** నగరంలో అనుమతి లేకుండా కొనసాగుతున్న నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం డీఐఈవో రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చాయి. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక నగర అధ్యక్షుడు సుభాష్, తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు, సంబంధిత శాఖల అనుమతులు లేకుండా కళాశాల నిర్వహిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్న భవనాన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కేశాపూర్ వద్ద ఉన్న నారాయణ ఇంటర్మీడియట్ కళాశాల యాజమాన్యం విద్యాశాఖ నుంచి అవసరమైన అనుమతులు లేకుండానే ఓ ప్రైవేట్ భవనంలో కళాశాలను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తున్న నారాయణ కళాశాల కూడా అవసరమైన అనుమతులు లేకుండానే నడుస్తోందని వారు ఆరోపించారు. తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం సంబంధిత యాజమాన్యంపై చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక నాయకులు సతీష్, సురజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'స్వీయ సంరక్షణ దినోత్సవం'



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రమదానం చేశారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నాగ్‌పూర్–ఇత్వార్‌పేట్ –జలాల్పూర్ గ్రామాలకు వెళ్లే రహదారిపై శ్రమదానం నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, పొదలను తొలగించారు. రహదారిపై వీటి కారణంగా వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి స్వచ్ఛందంగా శ్రమదానం చేసి రహదారిని ఆక్రమించిన చెట్లు, పొదలను తొలగించారు. ఇటీవల ఇదే రహదారిపై జరిగిన ప్రమాదంలో జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రజల ప్రాణాల రక్షణే తమ ప్రధాన బాధ్యత అనే ఉద్దేశంతో ఈ శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టామని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు మోహన్ రెడ్డి, సంతోష్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, బాల్కొండ మండల అధ్యక్షుడు ప్రవీణ్, వెంకటేష్ గౌడ్, మహేష్, భూమా రెడ్డి, రవి, అరవింద్, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్, గంగాధర్, కపిల్, నాగేష్, కృష్ణ, కిషన్ గౌడ్, నర్సారెడ్డి, సంజీవ్, యూనిస్, జావేద్, ఇమ్రాన్, రియాజ్, హనుమంతు, మహేష్, భూమేష్, శివ పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ..




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు మోపాల్ ఎస్సై సుశ్మిత తెలిపారు. శుక్రవారం బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలో ఆరుగురు వ్యక్తులు తమ ఫోన్లను పోగొట్టుకున్నట్లుగా ఫిర్యాదు ఇవ్వగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని రికవరీ చేశామన్నారు. ఫోన్లు పోగొట్టుకుంటే కంగారుపడకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆధారాలతో ఫిర్యాదు చేయాలని.. చట్టపరమైన ప్రక్రియ ద్వారా వాటిని రికవరీ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

## నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రక్తదానం



పోతంగల్ మండల కేంద్రంలో..



# కేటీఆర్ జన్మదిన వేడుకలు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రక్తదానాలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కేటీఆర్ ఇలాంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.**

**– అక్షరటుడే, నెట్‌వర్క్**




నందిపేట్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆర్మూర్‌లో పండ్ల పంపిణీ




లింగంపేట మండల కేంద్రంలో..

## నకిలీ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్.. ముగ్గురి అరెస్ట్



**అక్షరటుడే, కామారెడ్డి:** నకిలీ పత్రాలతో అసలు యజమాని స్థానంలో మరొకరిని నిలబెట్టి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ తెలిపారు. తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీ, సర్వే నెం.210/1లో గల ప్లాట్ నెం.71 అసలు యజమాని ముక్తవరం వెంకటయ్య. అయితే రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్ రెడ్డి తనపై ఉన్న అప్పులు తీర్చుకునేందుకు కుట్ర పన్నాడు. అందులో భాగంగా శ్రీనివాస్ రెడ్డి తన భార్య బండారి సునీతను కొనుగోలుదారుగా, తాడ్వాయి మండలం ఎండ్రియల్ గ్రామానికి చెందిన తన మామ సంగారెడ్డిని అసలు యజమాని వెంకటయ్యగా నటింపజేసి, నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించినట్లు డీఎస్పీ వివరించారు. అనంతరం ఆ భూమిని ఇతరులకు విక్రయించడంతో పాటు, ఆ తర్వాత పలువురి పేర్లపై వరుస రిజిస్ట్రేషన్లు జరిగినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు శ్రీనివాస్ రెడ్డి నేరం అంగీకరించడంతో అతనితో పాటు బండారి సునీత, సంగారెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో ఉపయోగించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. భూముల కొనుగోలు సమయంలో ప్రజలు యాజమాన్య హక్కులు, లింక్ డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులు, ఈసీ లను తప్పనిసరిగా పరిశీలించాలని డీఎస్పీ సూచించారు. నకిలీ పత్రాలతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.